సాక్షి
పల్నాడు
ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



వెండి నంది విగ్రహం అందజేత

పిడుగురాళ్ల: పట్టణంలోని శివాలయానికి ఐదు కేజీల నంది విగ్రహాన్ని ఈవో సుబ్బారెడ్డి సమక్షంలో పెరుమాళ్ల రాజేష్, వనజలక్ష్మి దంపతులు శనివారం అందజేశారు.



ధనుర్మాస మహోత్సవాలు

తాడేపల్లి రూరల్: ఆత్మకూరులోని బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస మహోత్సవాలలో 13వ పాశురాన్ని శనివారం శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వివరించారు.



ఘనంగా వెంకన్న కల్యాణం

భట్టిప్రోలు: స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శనివారం అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి 25వ వార్షిక కల్యాణం ఘనంగా జరిగింది.

న్యూస్‌రీల్

31న చేబ్రోలులో జాబ్ మేళా

చేబ్రోలు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 31న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి. శ్రీదేవి శనివారం తెలిపారు. సిద్ధి వినాయక బజాజ్, అపెక్స్ సొల్యూషన్స్, ఇన్నోవాసోర్స్ కంపెనీలు హాజరవుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన యువతీ, యువకులు పాల్గొనాలని ఆమె కోరారు.

రైలులో తప్పిపోయి తెనాలి వచ్చిన బాలిక



తెనాలి రూరల్: రైలులో తప్పిపోయి తెనాలి వచ్చిన బాలికను గుర్తించి బంధువులకు జీఆర్పీ పోలీసులు అప్పగించారు. నల్గొండ జిల్లా నకరికల్లు మండలానికి చెందిన 16 ఏళ్ల దోలూరి నిహారిక తప్పిపోయి డెల్టా ఎక్స్‌ప్రెస్‌లో తెనాలి వచ్చింది. బాలికను ప్లాట్‌ఫాంపై జీఆర్పీ పోలీసులు శుక్రవారం రాత్రి గుర్తించారు. బాలిక నుంచి వివరాలు కనుక్కొని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. బాలిక మేనమామ వెంకటరెడ్డి, బంధువులు శనివారం తెనాలి రాగా వారికి అప్పగించారు.

పోలీసుల అదుపు నుంచి నిందితుడి పరారీ

తెనాలి రూరల్: చోరీ కేసులో నిందితుడు పరారయ్యాడు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ముత్తెంశెట్టిపాలెం ఆంధ్రరత్న రోడ్డులో నిర్మాణంలో ఉన్న భవనం కోసం యజమాని పెద్ద మొత్తంలో వైర్లు, సామగ్రి తెప్పించి పెట్టాడు. ఇవి చోరీకి గురవడంతో వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు దర్యాప్తులో భాగంగా నిందితుడిని రేపల్లెకు చెందిన వ్యక్తిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన వైర్లను రేపల్లెలోని దుకాణంలో విక్రయించానని చెప్పడంతో రికవరీ కోసం కానిస్టేబుళ్లు అక్కడకు శుక్రవారం తీసుకెళ్లారు. ఓ దుకాణాన్ని చూపించి అక్కడే విక్రయించానని చెప్పి లోపలికి వెళ్లి పోలీసులకు చిక్కకుండా పరారయ్యాడు. చేసేది లేక దుకాణ యజమానిని పోలీసులు తమ వెంట తీసుకువచ్చి విచారిస్తున్నట్టు సమాచారం.

వేళంగణి వేడుకలకు ప్రత్యేక రైలు

లక్ష్మీపురం: నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా వేళంగిణి వేడుకలకు ప్రత్యేక రైలును కేటాయించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం డాక్టర్ ప్రదీప్‌కుమార్ శనివారం రాత్రి తెలిపారు. రైలు నంబరు (07125) సికింద్రాబాద్ – వేళంగిణి రైలు ఈనెల 30న సికింద్రాబాద్ నుంచి రాత్రి 8 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 7.30 గంటలకు వేళంగిణి స్టేషన్‌కు చేరుకుటుందని తెలిపారు. (07126) వేళంగిణి – సికింద్రాబాద్ రైలు జనవరి 1న వేళంగిణిలో రాత్రి 10 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 10.40 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. ప్రత్యేక రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, మాల్‌పాకం, కాట్పాడి, వేలూరు, తిరువణ్ణామలై, విల్లుపురం మీదుగా నాగపట్నం స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు.

బంగారం షాపులో చోరీ



పట్నంబజారు: బంగారం దుకాణానికి చెవిటి, మూగ వ్యక్తిలా వచ్చి ఆభరణాలు దోచుకుని పోయిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్నంబజారులో రియాజుద్దీన్ నిజాం జ్యూయలరీ షాపు నిర్వహిస్తున్నాడు. శనివారం గుర్తు తెలియని వ్యక్తి తాను మూగ, చెవిటి అని సర్టిఫికెట్ తీసుకొచ్చి, ఆర్థిక సాయం కావాలంటూ షాపు నిర్వాహకులను అడిగాడు. ఈ సమయంలో తన వద్ద ఉన్న టవల్‌ను టేబుల్‌పై ఉన్న బంగారు ఆభరణాల బాక్సుపై వేసి చాకచక్యంగా వెంట తీసుకుని వెళ్లాడు. 208 గ్రాముల బంగారం విలువ రూ. 15 లక్షలు ఉంటుంది. లాలాపేట పోలీసులు, సీసీఎస్ విభాగం సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించారు. నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

నిర్లక్ష్యపు కనోక్షన్లు!

- స్తంభాలేసి వదిలేసిన అధికారులు
- తీవ్రంగా నష్టపోతున్న అన్నదాతలు
- మిర్చి రైతులకు సాగునీటి కష్టాలు

రైతులపై కపట ప్రేమను ఒలకబోసే కూటమి సర్కార్ కనీసం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు కూడా ఇవ్వడం లేదు. రూ.20 వేల పెట్టుబడి సాయం ఇస్తానన్న హామీని ఇప్పటికే తుంగలో తొక్కింది. రైతులు అష్టకష్టాలు పడి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ప్రభుత్వానికి సొమ్ము చెల్లించి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. కానీ ఆ పని ఇప్పటివరకు కాలేదు.

అచ్చంపేట: అచ్చంపేట మండలంలో మార్చిలో పేర్లు నమోదు చేసుకున్న రైతుల పొలాలకు విద్యుత్తు స్తంభాలు వేసి తీగెలు లాగి, ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలి. జూన్ నెలలో పంటకాలం మొదలయ్యేనాటికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి. కూటమి సర్కార్ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. పత్తి సీజన్ ఇప్పటికే అయిపోయింది. నీళ్ల లేక పంట ఎకరాకు కనీసం రెండు, మూడు క్వింటాళ్ల దిగుబడి కూడా రాలేదని రైతులు చెబుతున్నారు. పెట్టుబడులు కూడా దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మిర్చి పంటకు కూడా అదే పరిస్థితి వచ్చింది. సెప్టెంబరు, అక్టోబరులలో వేసిన పంటలు ఇప్పుడు కాయ దశకు వచ్చాయి. ఈ సమయంలో రెండు, మూడు రోజులకు ఒకసారి నీళ్ల పెట్టాల్సి ఉంది. అప్పుడే కాయలు చెట్టుకు నిలబడతాయి. లేకుంటే రాలిపోవడం, తెగుళ్లకు గురవుతాయి. విద్యుత్ కనెక్షన్లు ఇస్తారన్న నమ్మకంతో రైతులు రూ.వేలు వెచ్చించి బోర్లు వేయించి, బావులు తవ్వుకున్నారు.

డీజిల్ ఇంజిన్లతో భారం

ఇక్కడి పొలాలకు సాగర్ జలాలు అందవు. పులిచింతల ప్రాజెక్టు నుంచి కృష్ణా, డెల్టా రైతులకు తప్ప ఇక్కడికి నీరు రాదు. బోర్లు, బావులపైనే ఆధారపడి పంటలు సాగు చేయాలి. ఈ ఏడాది వర్షాలు సకాలంలో పడి ప్రాజెక్టులు నిండాయి. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి. బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో రైతులు డీజిల్ ఇంజిన్లపైనే ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ఎకరాకు ఒక్క తడికే కనీసం రూ.3 వేల నుంచి రూ. 5 వేల వరకు ఖర్చు అవుతోంది. పంట కాలం పూర్తయ్యేనాటికి 10 సార్లు తడపాలంటే రూ.30 వేల నుంచి రూ .50 వేల వరకు పెట్టాల్సిందే. రైతులకు ఇది అదనపు భారంగా మారింది. కనెక్షన్లు ఇచ్చేందుకు అధికారులు జూన్‌లో వేసిన స్తంభాలకు తీగలు లాగకపోవడంతో చాలాచోట్ల కింద పడి విరిగిపోయాయి. పెదకూరపాడు నియోజకవర్గంలో సుమారు 200 మంది కనెక్షన్లకు దరఖాస్తు చేశారు. అచ్చంపేటలోనే పెదపాలెం, కొండూరు, చింతపల్లి, అచ్చంపేట, చామర్రు గ్రామాలకు చెందిన రైతులు 60 మంది వరకు ఉన్నారు. నవంబరులో పల్నాడు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరు పత్తిపాటి విజయకుమార్ నర్సరావుపేటలో నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఫలితం లేదని రైతులు చెబుతున్నారు. మరో పది రోజులలో వ్యవసాయ కనెక్షన్లు ఇస్తామని ఉమ్మడి గుంటూరు జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ మురళీకృష్ణ యాదవ్ చెప్పారు. తీగెలు, ఇతర సామగ్రి రావడం ఆలస్యమైనట్లు తెలిపారు. తాత్కాలిక ఏర్పాట్లతో కనెక్షన్లు ఇస్తామన్నారు. మండలంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గతంలో ఉన్న విద్యుత్ లైన్ల క్రమబద్ధీకరణకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.



తీగలు లేని విద్యుత్ స్తంభాలు (ఇన్‌సెట్‌లో) నేలకొరిగిన స్తంభాలు

తీగలు రాగానే కనెక్షన్లు ఇస్తాం

తీగల కోసం ఎదురు చూస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధంగానే ఉన్నాయి. చలానాలు కట్టి పేర్లు నమోదు చేసుకున్న వారి పొలాలకు సాధ్యమైనంత త్వరలో కనెక్షన్లు ఇస్తాం. గాలులు, తుపానులకు సుమారు 10 నుంచి 15 స్తంభాలు వరకు విరిగిపోయాయి. వాటిని మళ్లీ సిద్ధం చేస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– శివ కోటేశ్వరరావు, ఏఈ, విద్యుత్ శాఖ, అచ్చంపేట

కంటితుడుపుగా స్తంభాలు



ఎకరంలో మిర్చి పంట వేశా. గత మార్చిలో విద్యుత్ కనెక్షన్ కోసం డబ్బులు చెల్లించి ఆన్‌లైన్ చేయించుకున్నా. కనెక్షను ఇవ్వలేదు. నీళ్లలేక మిర్చితోట ఎండిపోతోంది. ఖర్చు పెరిగింది. ఏదో కంటి తుడుపుగా స్తంభాలు వేశారు. వాటిలో కొన్ని విరిగాయి.

– ఆవుల సాంబశివరావు, రైతు, చిగురుపాడు

అదనపు ఖర్చు తప్పడం లేదు



ఐదు ఎకరాలలో మిర్చి వేశా. ఎకరాకు సుమారు రూ.50 వేల వరకు ఖర్చు అయింది. విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో డీజిల్ ఇంజిన్ పెట్టుకోవాల్సి వస్తోంది. ఎకరాకు పంట కాలంలో కనీసం సుమారు రు.25 వేలకుపైగా అదనపు ఖర్చు అవుతోంది.

– షేక్ మాబూ సుభాని, రైతు, పెదపాలెం

అప్పులు మిగిలే అవకాశం



అసలే మిర్చి పంట ఈ ఏడాది గణనీయంగా తగ్గింది. తెగుళ్లు సోకుతున్నాయి. మిర్చి బెట్టకొస్తోంది. రెండు, మూడు రోజులకు ఒకసారైనా పంట తడపాలి. విద్యుత్ కనెక్షను కోసం దరఖాస్తు చేసుకున్నా ఇవ్వలేదు. ఆయిల్ ఇంజిన్లతో ఎకరాకు రూ.3 వేల వరకు ఖర్చు అవుతోంది. కౌలు మొత్తం, పెట్టుబడులు, అదనపు ఖర్చుతో అప్పులే మిగిలేలా ఉన్నాయి.

– మేకల కృష్ణారావు, రైతు, పెదపాలెం

ప్రజలకు పీఆర్కే కృతజ్ఞతలు



మాచర్ల: కూటమి సర్కార్ విద్యుత్ చార్జీల బాదుడుకు నిరసనగా చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అసత్య ఆరోపణలు చేయడమే తప్ప, ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ఆరోపించారు. విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన తెలిపే కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు లబ్ధి పొంది ఆనందంగా జీవితాలు గడిపారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్థికంగా చితికిపోతూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాలకులకు చేతలు మాని మాటలకు మాత్రమే పరిమితమైనట్లు చెప్పారు. ఇకనైనా ప్రతిపక్షంపై అసత్య ఆరోపణలు మాని పరిపాలన చేయాలన్నారు. ప్రజలు, కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు తగ్గించి ప్రజలపై భారం తొలగించాలని పేర్కొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్ రద్దు

నరసరావుపేట: ఈ నెల 30వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)ను రద్దు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 31వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు మండలంలోని యల్లమంద గ్రామ పర్యటన కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

రైతులు గింజగిజ

- పొలాల్లోనే వరి ఓదెల్లో మొలకెత్తిన ధాన్యం
- దిగుబడిపై ప్రభావంతో ఆందోళనలో అన్నదాతలు
- ధాన్యం కొనుగోలులో కూటమి సర్కార్ నిర్లక్ష్యం



వరి పొలంలో ఓదెలు

శావల్యాపురం: ప్రకృతి విలయాల ధాటికి అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది. గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షం వల్ల వరి పంట సాగు చేసి కోతలు కోసి పొలాల్లో వేసిన ఓదెల్లో గింజలు మొలకలు వస్తున్నాయి. దీంతో దిగుబడులు తగ్గితాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. వాతావరణం గత రెండు రోజుల నుంచి తెరపి ఇవ్వటంతో రైతులు పొలాల్లో ఓదెలు తిప్పుకుంటున్నారు. మరో వైపు గూళ్ల వేయటంతోపాటు వరి కోత కోసే పనుల్లో రైతులు నిమగ్నం అయ్యారు. ఖరీఫ్ సీజనులో మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో 2,500 ఎకరాల వరి సాగు చేశారు. ఇప్పటి వరకు 1,500 ఎకరాల మేర కోతలు కోసి ఓదెలు వేశారు. వరి గూళ్లుగా ఉంచారు. ఈ ఏడాది దిగుబడి బాగా ఉందని రైతులు సంతోషంగా ఉన్న సమయంలో తుపాన్ ప్రభావంతో ఒక్కసారిగా దిగాలు చెందారు. ఒక్కో ఎకరానికి ఇప్పటి వరకు రూ.35 వేలు పెట్టుబడులు పెట్టారు. తీరా పంట చేతికి వచ్చే సమయానికి అకాల వర్షంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

దళారుల దందా

పంటను కొందరు రైతులు పొలాల్లో యంత్రాలతో కోత కోయిస్తున్నారు. అక్కడే దళారులకు అయినకాడికి అమ్ముకున్నారు. శావల్యాపురం, కనమర్లపూడి, కొత్తలూరు, పోట్లూరు, గుర్రంవారిపాలెం తదితర ప్రాంతాల్లో చిరుజల్లులతో కూడిన వర్షం పడటంతో రైతులు తమ పొలాల్లో ఓదెలను ఆరబెడుతున్నారు. ఉష్ణోగ్రత పెరగటంతో ఓదెల్లోని గింజలు మొలకెత్తకుండా జాగ్రత్తలు పాటిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు తేమశాతం ఆధారంగా పంట కొనుగోలు చేస్తామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మెరక భూముల్లో పంట నష్టం తక్కువ ఉందని రైతులు పేర్కొన్నారు. ఆశించిన దిగుబడులు రావని చెబుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది.

రంగు మారిన ధాన్యం కొనాలి



ఆరు ఎకరాలలో వరి సాగు చేశా. అకాల వర్షంతో మూడు ఎకరాలకు పూర్తిగా నష్టం వాటిల్లింది. ఒక్కో ఎకరానికి రూ. 50 వేల వరకు ఖర్చు చేశా. ప్రభుత్వం మాలాంటి రైతులను ఆదుకోవాలి. ఓదెల్లో మొలకెత్తిన గింజల శాతం అధికంగా వచ్చింది. దీంతో దిగుబడులు తగ్గటంతో ఆర్థికంగా నష్టం జరుగుతోంది. నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలు చేయాలి. రంగు మారినా తీసుకోవాలి.

– కర్రె చిన అంజయ్య, రైతు, శావల్యాపురం

నిబంధనల మేరకు కొనుగోలు



రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేస్తాం. రైతులు ముందుస్తుగా తమ పేర్లు ఆయా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి. పంట నష్టం వాటిల్లిన గ్రామాల్లో రైతు సేవా వీఏఏలు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిహారం అందేలా చర్యలు తీసుకుంరు. రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో జిల్లా కలెక్టరు ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– బోయపాటి రవిబాబు, ఏడీఏ, వినుకొండ

ప్రతిభలో మేటి.. ఉత్సాహంగా పోటీ

- అట్టహాసంగా పల్నాడు బాలోత్సవాలు ప్రారంభం
- ముఖ్య అతిథులుగా ఎంపీ లావు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే చదలవాడ హాజరు
- పలు అంశాలలో తలపడిన విద్యార్థులు



సాంస్కృతిక పోటీల్లో విద్యార్థినులు



మాట్లాడుతున్న ఎంపీ లావు, వేదికపై ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

నరసరావుపేట: విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు పల్నాడు బాలోత్సవం లాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. శనివారం పల్నాడు రోడ్డులోని పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల ప్రాంగణంలో పల్నాడు బాలోత్సవం రెండవ పిల్లల పండుగ అట్టహాసంగా ప్రారంభమైంది. భారీ సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులకు లఘు నాటికలు, గ్రూపు శాస్త్రీయ నృత్యం, పాటలు, వ్యాసరచన, పోస్టర్ ప్రజెంటేషన్, కోలాటం, హ్యాండ్ రైటింగ్, సైన్స్ ప్రయోగాలు, కథా రచన, కథా విశ్లేషణ, మ్యాప్, ఏకపాత్రాభినయం, మైమ్, మ్యూజిక్, మిమిక్రీ, డిబేట్, క్విజ్, అంతర్జాలంలో అన్వేషణ పోటీలు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథులుగా ఎంపీ లావు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరయ్యారు. బాలోత్సవం కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎంపీ లావు మాట్లాడుతూ ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో స్నేహభావం, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని చెప్పారు. పిల్లలు అన్ని విషయాలు పంచుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వ్యవహరించాలని సూచించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ... ఆధునిక యుగంలో చిన్నారులు కంప్యూటర్, టీవీ, సెల్ ఫోన్లకు ఆకర్షితులై ఆటపాటలు, ఇతర కార్యక్రమాలు మర్చిపోతున్నారని తెలిపారు. ర్యాంకులే ముఖ్యం అన్నట్లు కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా పిల్లల భాగస్వాములు కావాలని కోరారు. విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ , బాలోత్సవాల కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు కపలవాయి విజయకుమార్, నల్లపాటి రాము, బాలోత్సవాల గౌరవ అధ్యక్షుడు ఎమ్మెస్ ఆర్కే ప్రసాద్, అధ్యక్షుడు సీహెచ్ రాజారెడ్డి, కోశాధికారి కోయా రామారావు, కమిటీ సభ్యులు ఎ. భాగేశ్వరిదేవి, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1616 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 100, తూర్పు కెనాల్‌కు 105, నిజాంపట్నం కాలువకు 72, కొమ్మమూరు కాలువకు 1343 క్యూసెక్కులు విడుదల చేశారు.



పోల్‌వాల్ట్ దూకుతున్న శ్రీనివాసులురెడ్డి (60 సంవత్సరాలు, బాపట్ల)

ఉరుకులెత్తిన ఉత్సాహం

గుంటూరు వెస్ట్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆరోఏపీ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్ షిప్– 2024 పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గల్లా మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడా సాధనకు వయస్సుతో సంబంధం లేదని తెలిపారు. ఎనిమిది పదుల వస్సులోనూ పోటీల్లో పాల్గొనడం నిజంగా గొప్పదనమని కొనియాడారు. అవకాశం ఉన్నంత వరకు ప్రతిరోజూ వ్యాయామం, యోగా, క్రీడా సాధన గానీ చేయాలని సూచించారు. ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ లాల్ వజీర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 400 మంది స్త్రీ, పురుష వెటరన్ అథ్లెటిక్స్ వివిధ విభాగాల్లో పాల్గొన్నారని తెలిపారు. ఆదివారంతో ఈ పోటీలు ముగుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు మార్చ్ ఫాస్ట్, జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు.

క్లుప్తంగా

14 మంది ఫైర్‌మెన్‌లు, ఇద్దరు డ్రైవర్లు ఎంపిక

క్రోసూరు అగ్నిమాపక కేంద్రానికి సిబ్బంది



క్రోసూరు: క్రోసూరు ఫైర్ అవుట్ పోస్ట్ సెలక్షన్ ఈవెంట్లను శనివారం సత్తెనపల్లి ఏజీకేఎం డిగ్రీ కాలేజ్‌లో నిర్వహించగా 14 మంది ఫైర్‌మెన్‌లు, ఇద్దరు డ్రైవర్లు ఎంపికైనట్లు సర్వీస్ ప్రొవైడర్ మార్కాపురం ప్రసాద్ తెలిపారు. ఈ ఎంపిక ఆర్ఎఫ్ఓ షేక్ జిలాని, డీఎఫ్ఓ శ్రీధర్, ట్రైనింగ్ సెంటర్ ఎస్‌డీసీ సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగినట్లు తెలిపారు. ఎంపికలకు 25మంది హాజరైనట్లు ప్రసాద్ వివరించారు.

సాగర్ డ్యాంపై సీఆర్‌పీఎఫ్ బలగాలు ఉపసంహరణ

తిరిగి సాయంత్రం విధుల్లో చేరిక



విజయపురిసౌత్: గత సంవత్సర కాలంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు భద్రతను పర్యవేక్షిస్తూ విధులు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు శనివారం ఉదయం తమ విధులను ఉపసంహరించుకొని తిరిగి సాయంత్రం తమ విధులలో చేరారు. గత సంవత్సరం తెలంగాణ రాష్ట్రంలో నవంబర్ 29న అసెంబ్లీ ఎన్నికలు జరుగతున్న సమయంలో నాగార్జునసాగర్ డ్యాంపై ఆంధ్రా పోలీస్ బలగాలు సగం ప్రాజెక్టును స్వాధీనంలోకి తీసుకున్నాయి. దీంతో కేఆర్ఎంబీ ఆదేశాల మేరకు డిసెంబర్ 3వ తేదీ నుంచి కేంద్ర బలగాలైన సీఆర్‌పీఎఫ్ సాగర్ ప్రాజెక్టును తమ ఆధీనంలోకి తీసుకొని భద్రత విధులు నిర్వహిస్తున్నాయి. సాగర్ డ్యాంపై తెలంగాణ వైపు సీఆర్‌పీఎఫ్ దళాలు ఆంధ్రాప్రాంతం వైపు అటు పక్క నుంచి సీఆర్‌పీఎఫ్ దళాలు శుక్రవారం రాత్రి వరకు కూడా విధులు నిర్వహించాయి. గతంలో సాగర్ ప్రాజెక్టు భద్రత విధులు నిర్వహించిన స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ దళాలు కేంద్ర బలగాలకు సహకారం అందించాయి. అకస్మాత్తుగా శనివారం తెల్లవారు జామున తెలంగాణ వైపు ఉన్న సీఆర్‌పీఎఫ్ బలగాలు తమ విధులను ఉపసంహరించుకొని హిల్‌కాలనీలోని బాలవిహార్ లోగల తమ క్యాంపులు ఖాళీ చేసి వెళ్లి పోయారు. దీంతో తెలంగాణ వైపు ప్రధాన డ్యాంపై స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ బలగాలు డ్యాంను తమ ఆధీనంలోకి తీసుకొని విధులు నిర్వహించాయి. అయితే శనివారం తెల్లవారుజామున సీఆర్‌పీఎఫ్ దళాలు చార్జ్ ఉపసంహరించుకోని వెళ్లి పోయి తిరిగి సాయంత్రానికి సాగర్‌లోని తమ క్యాంపులకు చేరుకోని నాగార్జునసాగర్ డ్యాం భద్రత విధులలో చేరాయి. అయితే ఆంధ్రా వైపు ఉన్నటువంటి బలగాలు తమ విధులను సాగర్‌డ్యాంపై కొనసాగిస్తూ ఉండటంతో తెలంగాణ వైపు తమ చార్జ్‌ను ఉపసంహరించుకున్న బలగాలు తిరిగి సాగర్ ప్రాజెక్టు విధి నిర్వహణకు చార్జీ తీసుకున్నట్లుగా తెలుస్తుంది. సాయంత్రం తిరిగి చార్జ్ తీసుఎకున్న సీఆర్‌పీఎఫ్ దళాల అసిస్టెంట్ కమాండర్ షహేర్ మాట్లాడుతూ శనివారం తెల్లవారు జామున తమ భద్రత విధులను ఉపసంహరించుకొని వెళ్లి పోయామని, తిరిగి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డ్యాం భద్రత విషయంలో తెలంగాణ వైపు మళ్లీ చార్జి తీసుకున్నట్లుగా తెలిపారు.

నాట్య మయూరం..జీవనం భారం

- సంగీతంలో సరస్వతి... నాట్యంలో మయూరి
- విధి వెంటాడి భర్త, ముగ్గురు కుమారుల మృతి
- మూడేళ్ల కిందటి వరకు విద్యార్థులకు సంగీత, నృత్యాల్లో శిక్షణ
- బాత్రూమ్‌లో జారిపడటంతో చచ్చుబడిన కాళ్లు
- దివ్యాంగుడైన నాల్గో కుమారుడిపై ఆధారపడి జీవనం



సంగీతాలాపన చేస్తున్న విజయలక్ష్మి(ఫైల్)

చిలకలూరిపేట: ఆమె సంగీతంలో సరస్వతి... నాట్యంలో మయూరి...థిల్లానా, భామాకలాపం, కృష్ణశబ్దం, జతిస్వరం, తరంగం వంటి నాట్యరీతుల్లో దిట్ట. అన్నమయ్య కీర్తనలు, త్యాగరాయకృతులు, జానపదుల్లో ఆరితేరిన స్వరఝరి. సంగీత, నృత్య శిక్షకురాలిగా ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఘనాపాటి. పగబట్టినట్లు విధి వెంటాడితే.. నెమలి నాట్యాలు నేర్పిన పాదాలు నిస్తేజంగా మారాయి. సుమధుర స్వరాలు పలికిన గొంతుక నిర్వేదం దాల్చింది. జీవితంలో ఒకే ఒక్క తోడైన బధిర మూగ వాడైన చిన్న కుమారుడు బాసటగా, భారంగా జీవితం వెళ్లదీస్తోంది.

బాల్యం నుంచే కళలపై ఆసక్తి...

పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని పండరీపురం మూడోలైనులో ఓ చిన్న అద్దె ఇంట్లో నివాసం ఉండే ఏడుపదుల ప్రాయం కలిగిన బెల్లంకొండ విజయలక్ష్మి స్వస్థలం మచిలీపట్నం. తండ్రి వానపాముల సత్యనారాయణకు భారతీయ సాంప్రదాయ కళలపై ఆసక్తి మెండు. స్వతహాగా కళాకారుడు. తండ్రి స్ఫూర్తితో పదేళ్ల ప్రాయం నుంచే ప్రముఖ సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ తండ్రి బుర్రా సుబ్రమణ్యశాస్త్రి వద్ద గుంటూరులో కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందారు. కావలికి చెందిన బెల్లంకొండ శివప్రసాద్‌తో వివాహం అనంతరం ఒంగోలులో ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసుడు ఎంఎస్ బాలసుబ్రమణ్యశర్మ వద్ద శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందటంతో పాటు సంగీతంలో డిప్లమో చేశారు. ఒంగోలులోని కృష్ణ మెమోరియల్ స్కూల్, కావలిలోని సెయింట్ ఆన్స్ స్కూల్ తదితర పాఠశాలలతో పాటు సాయంత్రం వేళల్లో ఇంటివద్ద విద్యార్థులకు సంగీత, నృత్య రీతుల్లో శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దేవారు. ఈ నేపథ్యంలో ఆమెకు ఎందరో ప్రముఖుల నుంచి ప్రశంసలు, అవార్డులు, రివార్డులు దక్కాయి.

వరించిన అవార్డుల్లో కొన్ని..



తుర్లపాటి కుటుంబరావు నుంచి అవార్డు స్వీకరిస్తూ..

నృత్య, సంగీత ఉపాధ్యాయురాలిగా ఆమె సేవలకు మెచ్చి పలు సంస్థలు ఆమెకు పలు అవార్డులతో సన్మానించాయి. 1993లో కావలి జన విజ్ఞాన వేదిక అవార్డు, 1994లో ఒంగోలు నెహ్రూ యువకేంద్రం అవార్డు, 1998లో నెల్లూరు విద్యాశాఖ ప్రశంసాపత్రం, 2006లో రిపబ్లిక్ డే సందర్భంగా అప్పటి జిల్లా కలెక్టర్ ఉదయలక్ష్మి చేతుల మీదుగా అవార్డు, 2014లో గుంటూరుకు చెందిన భారత వికాస సమితి పురస్కారం, 2018లో గుంటూరు స్వరనిధి సంస్థ పురస్కారం ఇలా ఎన్నో అవార్డులు, రివార్డులు వరించాయి.

వెంటాడిన విధి...

భర్త, నలుగురు సంతానం, సంగీతం, నృత్యం మేళవింపుగా సాగిపోతున్న ఆమె జీవితంపై కాలం కక్ష కట్టింది. ఒకటి తర్వాత ఒకటిగా విషాద సంఘటనలు ఆమె జీవితంలో కల్లోలం సృష్టించాయి. 28 సంవత్సరాల కిందట భర్త శివప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఇంటర్ చదువుతున్న కుమారుడు కరుణాకర్ క్యాన్సర్ బారిన పడి అశువులు బాసాడు. కుటుంబానికి అండగా ఉంటాడనుకున్న రెవెన్యూ ఉద్యోగి అయిన రెండో కుమారుడు రవిశంకర్ సైతం కాలేయ సంబంధిత వ్యాధితో మృత్యువాత పడ్డాడు. దీంతో 16 ఏళ్ల కిందట చిలకలూరిపేట చేరుకొని డ్యాన్స్ మాస్టర్ అయిన మూడో కుమారుడు రాజా, పుట్టుకతో మూగ, చెవిటివాడైన నాల్గో కుమారుడు చక్రధర్‌తో కలసి నివాసం ఉంటున్నారు. అయినా జాలి లేని విధికి వీరిపై కరుణ కలుగలేదు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడో కుమారుడు రాజా సైతం కన్ను మూశాడు

మూడేళ్లుగా మంచానికే పరిమితం...

దివ్యాంగుడైన నాల్గో కుమారుడితో ఒక చిన్న అద్దె ఇంట్లో ఉంటూ మూడేళ్ల కిందటి వరకు విద్యార్థులకు సంగీత పాఠాలు బోధిస్తూ వచ్చారు. అయితే అప్పటివరకు ఆమె జీవితంలో జరిగిన విషాదం చాలదన్నట్లు మూడేళ్ల కిందట బాత్రూమ్‌లో జారి పడటంతో రెండు కాళ్లు చచ్చుబడి పోయాయి. పుట్టు మూగ, చెవిటి వాడైన నాల్గో కుమారుడు చక్రధర్ స్థానికంగా ఉన్న మున్సిపల్ హైస్కూల్‌లో అవుట్ సోర్సింగ్ విధానంలో డ్రాయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తూ దాచుకున్న డబ్బు సైతం తల్లి వైద్యానికి ఖర్చు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. దివ్యాంగుడైనప్పటికీ మంచి చిత్రకారుడు కావడంతో తాత్కాలిక ప్రాతిపదికన డ్రాయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తూ అమ్మకు బాసటగా, అండగా నిలుస్తున్నాడు. ఒకరికి ఒకరు తోడుగా జీవిస్తున్న ఈ విధి వంచితులకు సమాజం బాసటగా నిలిచి ఆత్మీయత పంచాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.



దివ్యాంగుడైన కుమారుడు చక్రధర్‌తో విజయలక్ష్మి

'మీతో మేము'.. ప్రతిష్ఠాత్మకం

- ఎస్పీ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా కార్యక్రమం
- నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు



మీతో మేము కార్యక్రమంలో భాగంగా వర్టికల్ టీవీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

బొల్లాపల్లి: రాష్ట్రంలోని పల్నాడు జిల్లాలో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు మీతో మేము కార్యక్రమం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు అన్నారు. బండ్లమోటు పోలీస్‌స్టేషన్‌ను శనివారం సందర్శించారు. వార్షికతనిఖీలో భాగంగా తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, కేసులకు సంబంధించిన సీడీ ఫైల్స్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మీతో మేము కార్యక్రమంలో భాగంగా వర్టికల్ టీవీ గురించి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లాలోని 34 స్టేషన్‌ల్లో అమలవుతుందన్నారు. స్టేషన్‌తో పని ఉండి వచ్చే ప్రజలకు మీతో మేము కార్యక్రమం గురించి వివరించాలని ఎస్ఐ, సిబ్బందిని ఆదేశించారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బాల్యాన్ని బలి తీసుకుంటున్న అఘాయిత్యాలు, గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని, అలవాటు పడిన వారితో పాటు కుటుంబాన్ని నాశనం చేస్తుందని, డ్రగ్స్‌కు బానిసైతే కుటుంబానికి దూరమయ్యే అవకాశం ఉందన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు సంబంధించి సమాచారం అందజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకరరావు, బండ్లమోటు ఎస్ఐ ఎ.బాలకృష్ణ, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా న్యాయసహాయం పొందొచ్చు

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి
- యడ్లపాడులో 'విధాన్ సే సమాధాన్'



సదస్సుకు హాజరైన మహిళలకు చట్టాల బ్రోచర్లు అందిస్తున్న న్యాయమూర్తి కె.నరేంద్రరెడ్డి

యడ్లపాడు: ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచిత న్యాయ సేవలు పొందే అవకాశం ఉందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని చిలకలూరిపేట న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన యడ్లపాడు టీటీడీ కల్యాణ మండపంలో శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విధాన్ సే సమాధాన్ (చట్టం ద్వారా పరిష్కారం) కార్యక్రమంలో భాగంగా మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయమూర్తి కె.నరేంద్రరెడ్డి మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు సదస్సును ఏర్పాటు చేశామన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, వారి రక్షణకు ఏర్పాటైన చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించుకోవాలన్నారు. అప్పుడే వాటిని సద్వినియోగం చేసుకునే వీలుంటుందని వివరించారు. హిందూ సక్సెషన్ యాక్ట్ -2005 ప్రకారం స్త్రీ, పురుషుల్లో హెచ్చుతగ్గుల బేధాలు లేనట్టుగానే, ఆస్తిలోనూ సమాన హక్కు కలిగి ఉంటారన్నారు. గుంటూరు న్యాయవాది, రీసోర్సు పర్సన్ కాళిదాసు, ఎస్‌బీఏ ఝాన్సీ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం, బాలల హక్కు చట్టం, లైంగిక వేధింపుల నుంచిరక్షణకు పోక్సోచట్టం, గర్భస్థ శిశులింగ నిర్ధారణ నిషేధిత చట్టం, మానవ అక్రమ రవాణా చట్టం, గృహహింస చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హేమలతదేవి, ఎస్ఐ వి.బాలకృష్ణ, న్యాయవాదులు, మహిళలు హాజరయ్యారు.

'ఇంజినీరింగ్' సిబ్బంది పోరాటాలకు సిద్ధం కావాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

నరసరావుపేట: మున్సిపల్ కార్యాలయాల్లోని ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు అందరూ తమ డిమాండ్ల సాధనకోసం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో స్థానిక ఇంజినీరింగ్ కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికులకు చాలీచాలని జీతాలు ఇచ్చి వెట్టిచాకిరీ చేయిస్తుందన్నారు. జీఓ నంబరు 11 ప్రకారం స్కిల్డ్ కార్మికులుగా గుర్తింపు ఇవ్వాల్సిన వాల్వ్ ఆపరేటర్, డ్రైవర్, బోరు మెకానిక్, ఫిట్టర్, మెకానిక్, ఎలక్ట్రీషియన్‌లకు స్కిల్డ్ జీతాలు ఇవ్వకుండా సెమి స్కిల్డ్ జీతాలు చెల్లిస్తున్నారన్నారు. 15 నుంచి 20 ఏళ్లపాటు పనిచేసినా హెల్పర్లకు కేవలం రూ.15వేలు సెమి స్కిల్డ్ జీతాలు మాత్రమే ఇస్తున్నారన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు జీఓ నంబరు 7ప్రకారం రూ.21,500లు, జీఓ నంబరు 36 ప్రకారం రూ.24,500లు చెల్లించాల్సివుందన్నారు. ఈ రెండు జీఓల ప్రకారం ఏ జీతం చెల్లిస్తుందో అధికారంలో ఉన్న టీడీపీ కూటమి ప్రభుత్వం తేల్చాలని డిమాండ్ చేశారు. ప్రమాదకరమైన విధుల్లో పాల్గొంటున్న వారందరికి రిస్క్ అలవెన్స్‌లు లేవని, సెలవులు ఇవ్వట్లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే జనవరి 3వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల ఎదుట ఇంజినీరింగ్ కార్మికులు ధర్నాలు చేస్తున్నారన్నారు. సమ్మెకాలపు ఒప్పందాలు, జీతాల పెంపుకోసం పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ కార్మికులు ఈనెల 10వ తేదీన రిలే నిరాహారదీక్షలు చేయటం జరుగుతుందన్నారు. సంక్రాంతి తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంజినీరింగ్ కార్మికుడిని కలిసి సంతకాలు సేకరించి వచ్చే ఫిబ్రవరి 8, 9, 10 తేదీల్లో మున్సిపల్ కార్యాలయాల వద్ద రిలే నిరాహారదీక్షలు చేస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఛలో విజయవాడ నిర్వహించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దీనిలో కార్మికులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు సిలార్ మసూద్, నరసరావుపేట ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షుడు షేక్ చిన్న అల్లాభక్షు, జిల్లా ప్రధాన కార్యదర్శి అమరారపు సాల్మన్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు టి.మల్లయ్య, పి.యోహాన్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శిగా ప్రభుదాస్



ప్రభుదాస్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న రాజారావు

తాడేపల్లి రూరల్: ఏపీ ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ కౌన్సిల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంటీఎంసీ పరిధిలోని యర్రబాలేనికి చెందిన దాసరి ప్రభుదాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు శనివారం ప్రభుదాస్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాకాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.